ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందని



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందని అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధిహామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వ హించారు.

ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో నీడకు షెడ్ల ఏర్పాటుతో పాటు, మంచి నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పెరిగి న కూలికి అనుగుణంగా కొలతల ప్రకారం కూలీలతో పనిచేయించాలని, జీవో నంబర్ 15 ప్రకారం రోజు పంచాయతీ కార్యదర్శులు ఉపాధి పనులను పర్యవేక్షించాలన్నారు. ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్‌బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య, టెక్నికల్ అసిస్టెంట్‌లు వెంకటేష్, దివ్య, సురేష్‌లతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మొదలైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- 13 ప్రయోగాత్మక గ్రామాలకు 1,940 మంజూరు
- 623 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చిన అధికారులు
- 230 పిల్లర్ల దశలో, 50 ఇళ్లు బేస్‌మెంట్ వరకు పూర్తి
- త్వరలో బిల్లుల చెల్లింపు



మంథని మండలం అడవి సోమన్‌పల్లిలో బేస్‌మెంట్ పూర్తయిన ఇంటిని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రాజేశ్వర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం జిల్లాలో పునాదులు దాటుతోంది. ఇప్పటి వరకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 13 గ్రామాల్లో ఈ పథకం కొనసాగుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు జిల్లాలో చేపట్టిన ఇళ్లు ముందుకు సాగలేదు. మంథనిలో కొన్ని పూర్తికాగా లబ్ధిదారులకు అంద జేశారు. పెద్దపల్లిలోని హనుమం తుని పేట, చందపల్లిలో నిర్మాణంలో ఉన్న గృహాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ వాటిలో మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం మౌలిక వసతుల్లో భాగంగా తాగునీరు, రోడ్లు, మురికి కాలు వలు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేయగా ఆ పనులు పూర్తి కావస్తున్నాయి. రామగుండం, అంతర్గాం, సుల్తానాబాద్‌లో చాలా వరకు ఇళ్లు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు సొంత స్థలాలు ఉన్న వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు 3 లక్షలు ఇస్తామని ప్రకటించింది. కానీ లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరగడంతో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రాగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా లబ్ధిదారులు నిర్మించుకున్నారు. అదే తరహాలో ప్రభుత్వం ఇళ్ల పథకాన్ని తీసుక రావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. 2024-25 బడ్జెట్‌లో ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేసింది. ఆ తర్వాత మార్గదర్శకా లను రూపొందించిన ప్రభుత్వం ఆ మేరకు ఇంటింటి సర్వే నిర్వహించి సొంత స్థలాలు ఉన్న అర్హులను గుర్తించారు.



పాలకుర్తి మండలం రామారావుపల్లిలో పిల్లర్ల దశలో ఉన్న ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రాజేశ్వర్

జనవరి 26న పథకం ఆరంభం..

ఈ ఏడాది జనవరి 26న ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఆరంభించింది. అయితే మండలానికి ఒక గ్రామం చొప్పున జిల్లాలోని 13 రూరల్ మండలాల్లోని మద్దిర్యాల, బంజేరుపల్లి, శివపల్లి, కోనరావుపేట, రొంపికుంట, అడవిసోమన్‌పల్లి, మచ్చుపేట, శానగొండ, రామారావుపల్లి, నిమ్మనపల్లి, రత్నాపూర్, అంకంపల్లి, కాట్నపల్లి గ్రామాల్లో సొంత ఇంటి స్థలం ఉన్న 1,940 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇల్లు మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట

(మిగతా 8వ పేజీలో)

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి పనులపై క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల గురించి పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరాశాఖ, మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు ఏ స్థాయిలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్ అధికారులు అధికారులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

పెద్దపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం సోలార్ విద్యుత్‌పై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రెడ్కో ద్వారా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం అమలు చేస్తున్నామని, ఈ పథకం కింద ప్రజలు ఇంటిపై రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. 2 కిలో వాట్ ప్లాంట్ 150 యూనిట్ల వరకు, 3 కిలోవాట్ ప్లాంట్ 300 యూనిట్ల వరకు ప్రతీ నెలా విద్యుత్ పొందవచ్చన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసుకునే రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌కు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, కిలో వాట్‌కు 30 వేలు, 2 కిలో వాట్‌కు 60 వేలు, 3 కిలో వాట్‌కు 78 వేల రూపాయల సబ్సిడీ ఉందన్నారు. ప్రభుత్వం రెడ్కో ద్వారా అందించే వివిధ సబ్సిడీలను అధికారుల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మన అవసరాలకు మించి అధికంగా విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం కూడా లభిస్తుందన్నారు. జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్‌డీఓ కాళిందిని, ఎల్‌డీఎం వెంకటేష్, సంబంధిత అధికారులు, విద్యుత్ శాఖ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీస్ అందజేత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జీపీ కార్మికులు మండల పరిషత్ అధికారులకు సమ్మె నోటీస్ అందజేశారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఖాజా మాట్లాడుతూ జీపీ కార్మికులు 40 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని, నేటికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదన్నారు. గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామన్న సీఎం హామీ నెరవేరలేదన్నారు. ఈనెల 19 తరువాత నిరవధిక సమ్మె చేస్తామన్నారు. నరేష్, ముస్తాఫా, లక్ష్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్యమిషన్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ ఆసుపత్రులలో పని చేసేందుకు గైనకాలజిస్ట్ 1, అనస్థటిస్ట్ 1, సైక్రియాటిస్ట్ 1, స్టాఫ్‌నర్స్ 14లను కాంట్రాక్ట్ పద్ధతిపై భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం, విద్యార్హత, వివరాలు www.peddapalli.telangana.gov.inలో చూడాలన్నారు.

బీసీ గణనతో దేశం తెలంగాణ వైపు చూస్తుంది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ గణన చేసి 42శాతం విద్యఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రిజర్వేషన్లకు తీర్మానం చేసిన తెలంగాణ వైపు యావత్ దేశం చూస్తుందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటల్లోనే అమలు చేసామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ జరిపారన్నారు. బీసీలపై కల్లబొల్లి మాటలు చెప్పే బీజేపీ, బీఆర్ఎస్‌లు వారికి చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయాలని నిర్ణయించిందని, 1.75లక్షల మందితో రెండు సార్లు సర్వే చేయించిందన్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన కమిటీ బీసీ రిజర్వేషన్ పెంచేందుకు సిఫార్సు చేసిందన్నారు. రూ.8.5లక్షల కోట్ల అప్పు ఉన్నా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలపై ముందుకు పోతుందన్నారు. కేంద్రం సెక్షన్ 9 కింద దీన్ని ఆమోదించాల్సి ఉందన్నారు. అసెంబ్లీలో మద్దతు ఇచ్చినట్టు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసిన బీజేపీ, బీఆర్ఎస్‌లు ఢిల్లీకి రాకుండా వంచన చేశాయన్నారు. ఢిల్లీ జంతర్ మంతర్‌లో 3వేలమందితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్ష చేస్తే 80మంది ఎంపీలు హాజరై మద్దతు ఇచ్చారన్నారు. బీసీనని చెప్పుకునే ప్రధాని మోదీ బీసీలను వంచిస్తున్నాడన్నారు. బీసీ రిజర్వేషన్ పెంపునకు దేశ వ్యాప్తంగా బీసీలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు, పెద్దెల్లి ప్రకాష్, మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి తేజస్విని, గట్ల రమేష్, ముస్తాఫా పాల్గొన్నారు.

అట్టడుగువర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలి
- సమావేశంలో ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు రాంచందర్



సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు రాంచందర్

జ్యోతినగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియంలో హాలులో పెద్దపల్లి, మంచిర్యాల కలెక్టర్లు కోయ శ్రీహర్ష, కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ జె.అ రుణశ్రీ, డీసీపీ భాస్కర్, ఎస్సీ కమిషన్ జాతీయ సలహాదారులు సునీల్ బాబు, రీసెర్చ్ అధికారి డి.వరప్రసాద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాల గురించి కలెక్టర్లు వివరించారు. గతంలో ఎస్సీ కమిషన్ సభ్యుడి ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో జారీ చేసిన ఆదేశాలు, సూచనల అమలు, పనుల పురోగతిని అధికారులు వివరించారు. ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను పక్కాగా నమోదు చేయాలని, నిందితులకు కచ్చితంగా శిక్ష పడేలా సాక్ష్యాలను సేకరించాలన్నారు. అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అందిన ఫిర్యాదులకు తక్షణం ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. బలహీన వర్గాల యువత పరిశ్రమలు స్థాపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలు, ప్రోత్సహకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. బెల్లంపల్లిలో ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించాలని సూచించారు. ప్రధాని ఉపాధి కల్పన, ముద్రా రుణాలు, అంబేద్కర్ విదేశీ విద్యా పథకం, కులాంతర వివాహం సబ్సిడీ సకాలంలో అందేలా చూడాలని సూచించారు. దళితుల భూములను ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలని, ఆక్రమణదారుపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పకుండా పాటించాలన్నారు. రెండు జిల్లాల్లోని ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు, కారుణ్య నియామకాలు, పదోన్నతుల పెండింగ్ లిస్టు అందజేయాలని ఆదేశించారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించాం

- కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి కలెక్టర్

అట్రాసిటీ కేసులకు సబంధించి బాధితులకు చట్ట ప్రకారం పరిహారం సకాలంలో అందించామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బాధితులకు ఉపాధి కల్పన కింద రేషన్ డీలర్‌షిప్ ఇచ్చామని, వారి పిల్లలను గురుకులాలు, కేజీబీవీలలో చేర్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకం కింద ఐదు దరఖాస్తులు వచ్చాయని, ముగ్గురు అభ్యర్థులకు 47 లక్షల రూపాయలు చెల్లించామన్నారు. కులాంతర వి వాహం కింద 16 జంటలకు 40 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించామన్నారు. సమావేశం అనంతరం ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు రాంచందర్‌ను అధికారులు సన్మానించారు. సమావేశంలో రెండు జిల్లాల రెవెన్యూ అధికారులు గంగయ్య, సురేష్, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోల్‌సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలకసంస్థ పరిధిలో వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీపీసీ అనుమతులు, అభివృద్ధి పనులు, వీధిదీపాలు తదితర విషయాలపై ఇంజనీరింగ్, ఎన్‌పీడీసీఎల్, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. తాగునీటి విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నీటి సరఫరాపై వార్డు అధికారులు నిత్యం పరిశీలన చేయాలన్నారు. కార్పొరేషన్‌లో వీధి దీపాల సమస్య ఉండకూడదని, ఎక్కడ వీధి దీపాలు వెలగకున్నా వెంటనే అప్రమత్తం కావాలన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, అతాధికారులు క్షేత్ర స్థాయిలో రోజు తనిఖీలు చేయాలన్నారు. ఎన్టీపీసీ నిర్మాణాలు, అనుమతుల విషయంపై చర్చించారు. చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) విషయమై షార్ట్ ఫాల్స్‌ను పరిష్కరించుకోవడంలో ఎన్టీపీసీ దృష్టి పెట్టాలని ఆదేశించిన కలెక్టర్ సంబంధిత డీటీసీపీ అధికారులతో మాట్లాడారు. సీఎల్‌యూ జీఓ రాగానే వెంటనే ఫీజులు చెల్లించి అనుమతులు తీసుకోవాలని ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్ గడువు ఏప్రిల్ 30వరకు పొడిగించినందున దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేలా కార్పొషన్ యంత్రాంగం వారిని సంప్రదించాలన్నారు. 25శాతం రాయితీని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్‌పీడీసీఎల్‌కు సంబంధించి చార్జీల విషయంలో ఎన్‌పీడీసీఎల్, కార్పొరేషన్‌లు సమీక్షించుకోవాలని, ఆస్తి పన్ను బకాయిలు కూడా సర్దుబాటు చేసుకోవాలన్నారు. కార్పొరేషన్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడా చెత్తా చెదారం ఉండకుండా చూసువాలన్నారు. కమిషనర్ అరుణశ్రీ, కార్పొరేషన్ ఎస్ఈ శివానంద్, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులు సిఖిదర్, ఈఈ రామన్ పాల్గొన్నారు.



పెద్దాపూర్‌లో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కన్నులపండువగా యోగానంద లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

7

ఇస్రో యువికాకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ఒకే పాఠశాల నుంచి ఇద్దరు

అసంపూర్తిగా భవనాలు

- ఒకేచోట ఈజీఎస్, మోడల్‌హౌస్ నిర్మాణాలు
- నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిపోయిన వైనం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తొమ్మిదేళ్లుగా ఈజీఎస్ భవనం అసంపూర్తిగా ఉంది. ఈజీఎస్ భవనం లేకపోవడంతో ఎంపీడీవో కార్యాయంలోనే ఉపాధిహామీ పథకం కార్యాలయం నిర్వహిస్తున్నారు. 15సంవత్సరాల క్రితం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మోడల్‌హౌస్ భవనం కూడా అసంపూర్తిగా ఉన్నది. గతంలో ప్రభుత్వం ఐకేపీ, ఈజీఎస్ భవనాలు ఒకేచోట ఉండాలనే ఉద్దేశంతో ఈ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం 20లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. కింది ప్రాంతంలో ఐకేపీ భవనం నిర్మించి పైఅంతస్తులో ఉపాధిహామీ పథకం భవనం నిర్మించవలసి ఉంది. 20లక్షలతో గతంలో ఈభవనం నిర్మించి కాంట్రాక్టర్ ఐకేపీ కార్యాలయం మాత్రమే పూర్తిచేసి ఈజీఎస్ భవనం నిర్మాణం నిధుల లేమితో సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశారు. దీంతో ఈజీఎస్ పనులు చేసేందుకు కార్యాలయం లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయంలోనే ఈజీఎస్ పనుల నిర్వహణ జరుగుతోంది. తొమ్మిది సంవత్సరాలుగా ఈ భవనం అసంపూర్తిగా కట్టి వదిలేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ కార్యాలయానికి ఒక గది కేటాయించడంతో ఈజీఎస్ పనుల నిర్వహణకు ఒకే ఒక్క గదితో పనుల నిర్వహ ణకు ఇబ్బందులు ఏర్పడుతు న్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈజీఎస్ భవనం స్లాబ్‌తో పాటు 60శాతం పనులు మిగిలి ఉన్నాయని అధికారులు తెలి పారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మధ్యలో ఆగిపో యిన భవన నిర్మాణం పూర్తి చేయవలసిన ఆవశ్యకత ఎం తైనా ఉంది. 15 సంవత్సరాల క్రితం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్‌హౌస్ కట్టి మధ్యలో ఆపివేశారు. ఈ హౌస్‌కు కేవలం ప్యాచ్‌వర్క్ మాత్రమే ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఈ భవనం ప్యాచ్‌వర్క్ పూర్తిచేసి ఏదైన ప్రభుత్వ కారాలయాలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలో ఇరిగేషన్ కార్యాలయం కిరాయి ఇంటిలో నడుస్తుంది. 15 సంవత్సరాల క్రితం కట్టిన ఈ మోడల్‌హౌస్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు పూర్తిచేసి ఇరిగేషన్ కార్యాలయంకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న ఈరెండు భవనాలకు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఈజీఎస్ భవనం



15ఏళ్ల క్రితం అసంపూర్తిగా కట్టి వదిలేసిన మోడల్‌హౌస్

ప్రాణం తీసిన క్రికెట్ బాల్

- చికిత్స పొందుతూ బాలుడి మృతి


అశ్విత్‌రెడ్డి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బాల్ తగిలి గాయపడిన సంఘటనలో వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతానికి చెందిన దారం అశ్విత్‌రెడ్డి(9) అనే బాలుడు మృతిచెందాడు. గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన దారం శ్రీనివాస్‌రెడ్డి వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌లో మందుల దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు అశ్విత్‌రెడ్డితో పాటు ఒక కుమార్తె ఉంది. వేసవి సందర్భంగా ఒంటిపూట బడి కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 3వ తేదీ గురువారం పాఠశాల అయిపోయిన తర్వాత అశ్విత్‌రెడ్డి స్నేహితులతో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఇంటికి తిరిగివచ్చి యథావిధిగా శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. తరగతి గదిలో ఉన్న సమయంలో తలనొప్పిగా ఉందని చెప్పడంతో తండ్రి శ్రీనివాస్‌రెడ్డికి పాఠశాల నిర్వాహకులు సమాచారం అందించారు. అశ్విత్‌రెడ్డిని తండ్రి డాక్టర్ వద్దకు తీసుకువెళ్లగా తలపై క్రికెట్ బాల్ తగిలిందని చెప్పినట్లు సమాచారం. తలలో తీవ్రగాయమై రక్తస్రావం అవుతున్నట్లుగా గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ మేరకు బాలుడు అశ్విత్‌రెడ్డిని కరీంనగర్ తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్ అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు శస్త్ర చికిత్స చేసినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తిరిగి రెండో శస్త్రచికిత్స నిర్వహించగా మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయి బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సరదాగా క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లి బంతి తగిలి గాయపడిన తమ కుమారుడు మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీ

గంగాధర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీకి గురైనట్లు ఎస్‌ఐ వంశీ క్రిష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5న పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరాలను పరిశీలిస్తున్న క్రమంలో ఒక కెమెరా పనిచేయకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా కనిపించలేదు. పక్కనే ఉన్న క్రీడా రూంను పరిశీలించగా క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, షటిల్ బ్యాట్లు, గడియారాలు చోరీకి గురైనట్లు తెలిపారు. చోరీకి గురైన క్రీడా వస్తువుల విలువ 15వేలు ఉంటుందని, ప్రిన్సిపాల్ పద్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మామిడాలపల్లిలో పుస్తెల తాడు..

వీణవంక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన అరవకొండ సరమ్మకు చెందిన 2.5 తులాల పుస్తెలు తాడు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం సరమ్మ ఇంటి ముందు నిద్రిస్తుండగా తెల్లవారుజామున చూసుకునే సరికి పుస్తెలు తాడు మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకొని వెళ్లినట్టు తెలిపారు. సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తిరుమల్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కొంరయ్య వృత్తిరీత్యా సుతారి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనంపై తోకలపల్లి గ్రామ శివారులో రోడ్డు దాటుతుండగా ఓ కారు డ్రైవర్ వచ్చి ఢీకొట్టడంతో తలకు, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన కొంరయ్యను స్థానికులు ఆటోలో హుజూరాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు కొంరయ్య సోదరుడి కుమారుడు సముద్రాల పవన్‌కల్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నకిలీ ధ్రువీకరణపత్రాల కేసులో యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రం కేసులో మహమ్మద్ యూసుఫుద్దీన్ (37) అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గాలిపెల్లి పశువైద్యశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న దేవమ్మ మెడికల్ ఇన్వాలిడేషన్ సర్టిఫికెట్ సమర్పించగా జిల్లా అధికారులు విచారణ జరిపి నకిలీపత్రాలు అని తేల్చారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా మంగళవారం యూసుఫుద్దీన్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చెరువుల్లో చేపల పెంపకం

సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గై చెరువులో పట్టిన చేపలు



- గ్రామాల్లో ఉపాధి పొందుతున్న మత్స్యకారులు
- ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయాలని వేడుకోలు
- చెరువులు, కుంటల్లో నీటిని నింపితే మరింత ఆదాయం

సైదాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంతో గ్రామాల్లోని మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు చెరువుల్లో నీరు లేక చేపల పెంపకం ఆశాజనకంగా లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడం, కాలువ ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరుతోంది. దీనికి తోడు ప్రభుత్వం ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయడంతో మత్స్యకారులు చెరువులు, కుంటలలో చేప పిల్లలు పోసి ఉపాధి పొందుతున్నారు. గత సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా కురియడం వల్ల చెరువులలో నీరు ఎక్కువ కాలం ఉండడంతో చేపలు ఎక్కువ సైజు వరకు పెరిగి ఎక్కువ ఆదాయం వచ్చిందని మత్స్యకారులు చెపుతున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో కురిసిన వర్షాలు ఇప్పటి వరకు లేక పోవడం, ఆ వర్షాలకు చెరువులు పూర్తిగా నిండక పోవడంతో పాటు కాలువ నీరు కూడా అంతంత మాత్రంగా రావడం తో చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగా చేరింది. నీరు సమృద్ధిగా లేక చేపలు తక్కువ సైజు పెరిగాయని, సుమారు సగం వరకు ఆదాయం తగ్గిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఉచిత చేపపిల్లలు ఇవ్వక పోవడం కూడా ఆదాయం తగ్గుదలకు కారణమని తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి కాలువ నీళ్ల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని కోరుతున్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలు జీవనోపాధి పొందుతాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. అలాగే చేప పిల్లలు కొనడానికే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తున్నదని, ప్రభుత్వం 100 శాతం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కాలువ నీళ్లతో చెరువులు నింపాలి

సైదాపూర్ మండలంలో 30 గ్రామ పంచాయతీలుండగా 17 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. అందులో 2వేల మంది తమ్యుకార సభ్యత్వాలున్నాయి. సుమారు 2వేల పైన కుటుంబాలు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. అయితే సైదాపూర్ మండలానికి ఒక పక్క నుంచి కాకతీయ కెనాల్ ఉన్నది. కొంత భాగానికి మిడ్ మానేరు కాలువ ఉంది. మరికొన్ని గ్రామాలకు గౌరవెల్లి కాలువ వస్తుంది. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కాలువ నీళ్ల సమృద్ధిగా వదిలితే సైదా[illegible] మండలంలో చెరువులు, కుంటలు పూర్తిగా నిండే అవకాశం ఉన్నది. మరోవైపు అన్ని గ్రామాల్లో ప్రతి యేటా ఉచిత చేప పిల్లలను అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలి

పెసరు కుమారస్వామి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు



ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా కాలువల ద్వారా అయా ప్రాంతంతోని చెరువులు, కుంటలు నింపాలి. దీనితో పాటు ఉచిత చేపపిల్లలు పంపిణీ చేయాలి. ప్రతి గ్రామంలో మత్స్యకార కుటుంబాలు చేపల పెం^ఎకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. చెరువులు, కుంటలు నింపడం వల్ల మత్స్యకారు లకు చేతి నిండా పని దొరికి ఆర్థి కంగా అభివృద్ధి చేందే అవకాశ ముంది. ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. నందికమాన్ సమీపంలోని రోడ్డు పక్కన సుమారు 60 సంవత్సరాల వయస్సుగల, పసుపు పచ్చ చీర, ఎరుపు రంగు జాకెట్ కలిగిన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు గుర్తించమన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేసి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే వేములవాడ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కలప పట్టివేత

కొడిమ్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీ అధికారులు పట్టుకున్నారు. అటవీ సిబ్బందికి అందిన పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి అటవీ శాఖ రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి ట్రాక్టర్‌లో తరలిస్తున్న 35వేల రూపాయల విలువైన 44టేకు దుంగలను పట్టుకున్నారు. డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్, దమ్మయ్యపేట బీట్ అధికారి అశ్విణి, బేస్ క్యాంప్ సభ్యులు ఉన్నారు.

బందోబస్తు మధ్య అంత్యక్రియలు

రుద్రంగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌తో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత, నిహాల్ తేజ్ అనే తల్లికొడుకుల మృతదేహాలు మంగళవారం రుద్రంగికి చేరుకున్నాయి. దీంతో బంధువులు రోదనలు మిన్నంటాయి. రుద్రంగిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ - సిరిసిల్ల జిల్లా కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వెంటనే పీఆర్సీని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా ట్రెజరీల్లో ఆమోదం పొంది కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్నిబిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. రెండు సంవత్సరాలుగా సెలవు జీతాలు, సప్లమెంటరీ వేతనాలు, మెడికల్‌బిల్లులు జీపీఎఫ్, పెన్షన్ టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సంవత్సరం మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూనిటేషన్ మొత్తాలను చెల్లించకపోవడం వల్ల పెన్షనర్లు ఇబ్బందులకు గురైతున్నారన్నారు. బకాయి పడిన ఐదు వాయిదాల డీఎలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పాత విధానాన్ని కొనసాగించడం విచారకరమన్నారు. జీవో 317ను సవరించి బాధితుందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుచేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని, రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డీఈవో పోస్టులకు, అన్ని మండలాలకు ఎంఈవోలను నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ దశల వారీగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు పాములస్వామి, అడేపు శివకుమార్, తిరపతి, కొత్వాల్ ప్రవీణ్, పోలాస మల్లేశం, కోటగిరి లక్ష్మణ్, మధుసూదన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోరుట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత (20) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఏసీగోన్ని గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత పట్టణానికి చెందిన పవన్‌ను కొన్ని రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకొని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. మంగళవారం రోజు పవన్ తండ్రి అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రంజిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి బయటకు రాకపోవడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఇంట్లోకి వెళ్లి చూడగా రంజిత ఉరివేసుకొని ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


సంధ్యారాణి (ఫైల్)

జైపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీధ ర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన నడిగొట్టు సంధ్యారాణి(40) కుటుంబీకులతో కలిసి మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చింది, కారులో తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న వాహనం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సంధ్యా రాణిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సంధ్యారాణి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతిని లైంగికంగా వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువతిని కులం పేరుతో దూషించి లైంగికంగా వేధించిన కేసులో గోదావరిఖని రాజీవ్‌నగర్‌కు చెందిన ఆవుల మల్లయ్యకు మంగళవారం కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. 2017లో అడ్డగుంటపల్లిలో ఈ ఘటన జరిగిందన్నారు. ఈ కేసు కరీంనగర్‌లోని ఎస్‌సీ, ఎస్‌టీ కోర్టులో విచారణ జరుగగా గోదావరిఖని కోర్టు ఏఎస్‌ఐ తిరుపతిరావు, కానిస్టేబుల్ మహేందర్ సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. బాధితురాలి తరఫున ప్రభుత్వ న్యాయవాది రాములు నేరం నిరూపించారన్నారు. న్యాయమూర్తి నీరజ తీర్పు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దోషికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బంది, పీపీ రాములును సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ పుల్లా కరుణాకర్, ఏసీపీ రమేష్ అభినందించినట్టు సీఐ పేర్కొన్నారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

మంథనిరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజు లపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో కాలువ పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలపై మంగళవారం ఉదయం తేనెటీగలు దాడి చేశాయి. కాలువ పూడికతీతలో భాగంగా చెట్లను తొలగిస్తుండగా చెట్లపై ఉన్న తేనే తీగలు ఒక్కసారిగా లేచాయి. కూలీలు అక్కడి నుంచి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తుండగా అవి ఒక్కసారిగా దాడి చేయడంతో 11 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటనలో పేరం దుర్గయ్య, గంగుల స్వామి, తోగరి మల్లయ్య, వేల్పుల రాయలింగు, పేరం లక్ష్మి, నలోటి లక్ష్మి, తోగరి గౌరమ్మ, వేల్పుల లక్ష్మి, వేల్పుల బాను, గోస్కి ఎల్లమ్మ అనే కూలీలకు గాయాలయ్యాయి. వీరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. గాయపడిన ఉపాధిహామీ కూలీలను ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గొర్కెల సురేష్, మంథని లింగయ్యలు పరామర్శించారు. గాయపడ్డ కూలీలకు మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను వారు కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

బీర్‌పూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యా యత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందిందని ఎస్సై కుమారస్వామి తెలిపారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన పసుల గంగవ్వ(26)కు రెండు సంవత్సరాల క్రితం తన బావ అయిన తాటిపల్లి మహేందర్‌తో రెండో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొన్ని రోజుల తరువాత జీవనోపాధి నిమిత్తం ముంబాయికి వెళ్లారు. అక్కడ గంగవ్వ కడుపు నొప్పితో బాధపడడంతో స్వగ్రామానికి వచ్చింది.

అయినా నయం కాకపోవడంతో గత నెల 21న క్రిమిసం హారక మందు తాగింది. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ గంగవ్వ మృతి చెందింది. మృతురాలు గంగవ్వ తండ్రి లింగయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు కలెక్టర్ చేయూత


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రెండో బైపాస్ రోడ్డులో మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరికి కలెక్టర్ చేయూత నందించారు. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. చంద్రంపేట శివారులోని రెండో బైపాస్ రోడ్డు జంక్షన్‌లో బైక్, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యు వకులు గాయపడ్డారు. అదే సమయంలో అధి కార పర్యటన నిమిత్తం వెళ్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంఘటనను చూసి తన వాహనాన్ని ఆపారు. గాయపడ్డ యువకులను పరామర్శించి అంబులెన్స్‌లకు సమాచారం అందించి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల-మరిమడ్ల రహదారిపై తనిఖీలు భాగంగా ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 10 లీటర్ల నాటుసారా లభించిందన్నారు. సారాను, రవాణాకు వాడిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకొని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కాంగ్రెస్ జెండా గద్దె ధ్వంసం


జెండా గద్దెను పరిశీలిస్తున్న పోలీసులు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. కాగా కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టిమల్ల చేరుకొని ధ్వంసమైన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను పరిశీలించి సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

చెంజర్లలో పూరిల్లు దగ్ధం

- కాలిబూడిదైన రూ. 1.50 లక్షలు, సామగ్రి

మానకొండూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందజర్లలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ పూరిల్లు మంగళవారం దగ్ధమైంది. చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన జ్యోతి-అశోక్ దంపతులకు ఇద్దరు కుమారులు చరణ్, అరవింద్ ఉన్నారు. జ్యోతి, అశోక్ గ్రామంలోని ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తు ఇద్దరు పిల్లలను సాకుతున్నారు. మంగళవారం ఉదయం ఇంటిలో పూజ చేసి దీపం ముట్టించి ఎప్పటిలాగే పనులకు వెళ్లగా కుమారులు పాఠశాలకు వెళ్లారు. వారు వెళ్లిన కొద్ది సేపటికే ముట్టించిన దీపం సమీపంలోని బట్టలకు అంటుకొని పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. నూతన ఇంటి నిర్మాణానికి 1.50 లక్షల రూపాయలను అప్పు తెచ్చి బీరువాలో దాచాగా ప్రమాదంలో బీరువాలోని బట్టలతో పాటు నగదు, 50 కిలోల బియ్యం, వంట సామగ్రి, రెండు మంచాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాములు, రికార్డు అసిస్టెంట్ బాబుదేవ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పూరిల్లు దగ్ధం కావడంతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత దంపతులు కోరారు.


దగ్ధమైన పూరిల్లు వద్ద బాధితులు

ఇస్రో యువికాకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

ఒకే పాఠశాల నుంచి ఇద్దరు



పి.సాత్విక, పి.సిరివెన్నెల, టి.సాయిహర్షిత

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ యేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యువ శాస్త్రవేత్త కార్యక్రమానికి జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగినేడుకు చెందిన భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు కె.జగదీశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలవేణి సాత్విక, పడాల సిరివెన్నెల, పాలకుర్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాలకు చెందిన భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు బి.రవీనందన్‌రావు మార్గదర్శనంలో తోడేటి సాయిహర్షిత ఎంపికయ్యారు. గతనెలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ముగ్గురు యువికా 2025కు ఎంపికైనట్లు డీఈఓ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 28రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి వేలాది మంది 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. రాష్ట్రం నుంచి ఈసారి 12మంది విద్యార్థులు ఎంపిక కాగా ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురు పెద్దపల్లి జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. గతేడాది రాగినేడు ఉన్నత పాఠశాలకు చెందిన రంగు కీర్తన ఎంపిక కాగా ఈసారి అదే పాఠశాల నుంచి ఒకే తరగతికి చెందిన ఇరువురు ఎంపికయ్యారు. ముగ్గురు విద్యార్థులు మే నెలలో ఇస్రోకు చెందిన 7పరిశోధన కేంద్రాల్లో ఒకచోట అంతరిక్ష సాంకేతికత, అనువర్తనాలపై రెండువారాల ఆవాస శిక్షణా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థినులు శిక్షణకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎంపికైన విద్యార్థినులను, గైడ్ టీచర్లను డీఈవో డి.మాధవితో పాటు డీఎస్‌ఓ సమగ్ర శిక్ష సమన్వయకర్తలు పీఎం.షేక్, సీహెచ్ మల్లేష్‌గౌడ్, కవిత, అజీం, మండల విద్యాధికారులు టి.సురేంద్రకుమార్, టి.విమల, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ఆగయ్య, జె.కమలాకర్‌రావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

సైనిక్ స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ఎగ్జిబిషన్



స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ బస్ వద్ద విద్యార్థులు

చొప్పదండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ సైనిక స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ బస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. జిల్లాలో మొట్ట మొదటిసారిగా రుక్మాపూర్ సైనిక్ గురుకుల స్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్న లక్ష్యంతో ఎన్‌ఆర్‌ఎస్‌సీ సంస్థ స్పేస్ ఆన్ వీల్స్‌ను నిర్వహిస్తున్నారు. అంతరిక్ష విద్య, దాని అనుభవాలను సందర్శించడానికి తక్కువ అవకాశాలు ఉన్న గ్రామీణ పిల్లలకు అందించడం ఎగ్జిబిషన్ లక్ష్యం. ఈ ప్రత్యేక వాహనంలో ఉపగ్రహ నమూనాలు, లాంచ్ వెహికిల్స్ భారత అంతరిక్ష ప్రయోగాల విజయాలు, భవిష్యత్తు ప్రాజెక్టుల వివరాలు, అంతరిక్ష విజ్ఞాన సంబంధిత వీడియోలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఎస్‌సీ సైంటిస్టులు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ టి శంకర్ ప్రసాద్, స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరామావు,ప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వండి


కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కార్మికుడు, సామాజిక కార్యకర్త అలువాల రాములు కోరారు. కొత్త రేషన్‌కార్డు ఇవ్వాలని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు నుంచి కరీంనగర్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. దారి పొడవునా ఆలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డులు జారీ చేసేలా చూడాలని దేవుళ్లకు మొక్కారు. మంగళవారం కరీంనగర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాములు కొత్త రేషన్‌కార్డు కోసం అనేక సార్లు దరఖాస్తు చేసుకొని విసిగిపోయాడు. తన మాదిరిగా ఎంతో మంది రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేక పోతున్నారని, కార్డులు వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరేందుకు పాదయాత్ర చేపట్టానని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు ఇప్పించి, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని కోరారు.

10న ఉమ్మడి జిల్లా అండర్-19 బాక్సింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-19 మెన్ అండ్ ఉమెన్స్ బాక్సింగ్ ఎంపి క పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల బాక్సింగ్ క్రీడాకారులు ఉదయం 10 గంటలకు స్టేడియంలో ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఒక పాస్ పోర్టు ఫొటోతో హాజరు కావాలని, వివరాలకు 9100668474 నంబరులో సంప్రదించాలని ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సంపత్ కుమార్ తెలిపారు.

అందుబాటులోకి ఎల్‌సీ యాప్

లైన్ క్లియర్ అనుమతి నుంచి రిటర్న్ వరకు యాప్‌లోనే



గణేశ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఎన్పీడీసీఎల్ మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ ఎల్‌సీ (లైన్ క్లియర్) యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఎల్‌సీ తీసుకుని పని చేసే సమయంలో మానవ తప్పిదాలు జరుగుతున్న నేపథ్యంలో నూతనంగా తీసుకొచ్చిన యాప్ వినియోగదారులకు.. ఇటు ఎన్‌పీడీసీఎల్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు, విద్యుత్ అంతరాయ సమయాలు, మానవ తప్పిదాలను నివారించేందుకు లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించామని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మేక రమేష్‌బాబు తెలిపారు.

యాప్ పని చేసే విధానం

విద్యుత్ సరఫరాలో ఎల్సీ తీసుకోవాలనుకున్న లైన్‌మన్ మొదట లైన్ క్లియర్ యాప్ ఓపెన్ చేయాలి. సంబంధిత ఫీడర్లో ఎల్‌సీ కావాలని ఏఈకి మెసేజ్ చేయాలి. ఏఈ లైన్‌మన్ పంపిన మెసేజ్‌ను పరిశీలించి ఆ ఫీడర్లో ఎల్‌సీ ఇవ్వొచ్చా.. లేదా అని, అత్యవసర అవసరాలు ఏమైనా ఉన్నాయా లేదా మరే ఇతర షెడ్యూల్ చేసిన పనులు ఉన్నాయా అని సమీక్షిస్తారు. దాని ప్రకారం ఎల్‌సీ ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు.. ఏఈ ఎల్‌సీ అనుమతి ఇవ్వగానే సంబంధిత లైన్‌మన్‌కు సమాచారం అందుతుంది. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్‌కు ఎల్సీ ఇవ్వాలో యాప్ ద్వారా మెసేజ్ వస్తుంది.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో పొరపాట్లు లేకుండా తగిన సూచనలు, జాగ్రత్తలు హెల్మెట్ పెట్టుకోవడం, హ్యాండ్ గ్లౌజ్ వేసుకోవడం, ఎర్త్‌రాడ్ వాడాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేస్తారా లేదా అని యాప్ గుర్తుచేస్తుంది. వీటన్నింటిని సబ్‌స్టేషన్ ఆపరేటర్ చేసి ఫొటో తీసి యాప్ అప్లోడ్ చేస్తే ఆ ఫొటోను యాప్ ద్వారా లైన్‌మన్ చూసి.. ఆ ఫొటోలో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా.. లేదా.. అని ధ్రువీకరించుకుని పని ప్రారంభిస్తాడు. లైన్‌మన్ ఎంతమంది సిబ్బందితో పని చేయిస్తున్నాడో వారి పేర్లు యాప్‌లో పొందుపర్చాలి. పని పూర్తి కాగానే ఈ పనికి సంబంధించి ఫొటో, సిబ్బంది వచ్చారా.. లేదా అని యాప్‌లో పొందుపర్చి ఎల్‌సీని రిటర్న్ చేయాలి. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిటర్న్ చేయాలని ఆదేశాలు వెళ్తాయి. రిటర్న్ చేసిన ఎల్‌సీ సమాచారం ఏఈకి అందుతుంది. ఏఈ ఆదేశాల మేరకు ఆ ఫీడర్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు.

ప్రమాదాల నివారణ

విద్యుత్ లైన్ క్లియర్‌లో ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్ను ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థ సరిగ్గా గుర్తు చేసుకోకపోవడం, సమాచార లోపం, తదితర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రిషియన్లు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నివారణ కోసం ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించొచ్చు. అనవసరమైన ఎల్‌సీలు తగ్గించొచ్చు. ఎల్‌సీల సమయాలను గణనీయంగా తగ్గించడమే కాకుండా ఎల్‌సీ తీసుకున్న సమాచారం పైఅధికారులకు వెంటనే తెలిసి పోతుంది. సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్‌సీలను ఈ యాప్ ద్వారా నివారించొచ్చు.

TSNPDCL

కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా?

జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి వచ్చిన వలస నాయకుడే

అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన వలస నాయకుడేనని, తనపై చేసిన అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విలేకర్లతో మాట్లాడారు. తనపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని తాను కాంగ్రెస్‌లో చేరి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని అన్నారు.

సోమవారం సారంగాపూర్ మండలంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాధికారం కోసమే కాంగ్రెస్ ముసుగులో బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని పరోక్షంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను విమర్శించారు. దీనిపై సంజయ్ కుమార్ స్పందిస్తూ తనపై జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి జీవన్‌రెడ్డి ఎంతోమందిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని సంజయ్‌కుమార్ గుర్తుచేశారు. మీరు పార్టీలో చేర్చుకుంటే లేని తప్పు, నేను కాంగ్రెస్‌లో చేరితే ఎలా తప్పు అవు తుందని జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రశ్నించారు. జగిత్యాల ప్రజలకు ఎవరు వలస వచ్చిన నాయకుడో తెలుసునని అన్నారు. తాను చేసిన అభివృద్ధితోనే రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని ఎమ్మెల్యే అన్నారు. సీనియర్ నాయకుడిగా జీవన్‌రెడ్డిని గౌరవిస్తానని, తన గౌరవాన్ని కాపాడుకుంటే మంచిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు.

ముగ్గురికి జీవిత ఖైదు

కరీంనగర్‌లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, రూ. 2వేల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నీరజ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రామగుండం మండలం మల్రిపల్లికి చెందిన గూండా శంకరయ్య తన కూతురును ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని అదే గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన దొబ్బల పవన్(21)పై కేసు పెట్టాడు. ఆ కేసులో పవన్ జైలుకు వెళ్లి వచ్చాడు. కొన్నాళ్లకు పవన్‌కు వేరే అమ్మాయితో పెళ్లి సంబంధం కుదిరింది. ఈ విషయం తెలిసి 2016 ఆగస్టు 21 మధ్యాహ్నం పవన్ తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుండగా గూండా శంకరయ్య, అకినపల్లికి చెందిన మండే శ్రీనివాస్, ఎగ్లాస్పూర్‌కు చెందిన క్యాతం రవీందర్ అడ్డుకున్నారు. బూతులు తిట్టి చనిపో అంటూ అవమానపరిచారు. దీంతో ఇంటికి వచ్చిన పవన్ జరిగిన విషయాన్ని తన తమ్ముడికి చెప్పి రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చనిపోయాడు. ఈ సంఘటనపై పవన్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో రామగుండం పోలీసులు గుండా శంకరయ్య (40), మెండే శ్రీనివాస్(35) క్యాతం రవీందర్(55)పై కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాల పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ముగ్గురికి జీవిత ఖైదు విధించారు.

'రాజన్న' ఆలయ విస్తరణకు శ్రీకారం

- 15న వేములవాడకు ఉన్నత అధికారుల రాక
- సమీక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజ రామయ్యార్



మ్యాపులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజరామయ్యార్

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పనులపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన దేవాదాయ శాఖ మంత్రిత్వ కార్యదర్శి శైలజరామ య్యార్, ఓఎస్‌డీ సోమరాజులు, కమిషనర్ శ్రీధర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం విస్తరణ పనులపై చర్చించారు. ఈనెల 15న దేవాదాయ శాఖ కమిషనర్ ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి వేముల వాడలో పర్యటించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి పర్యటన చేసి మరోసారి శృంగేరీ పీఠం వారి వద్దకు వెళ్లాలని నిర్ణయించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్కిటెక్‌తో తయారు చేయించిన ఆలయ విస్తరణ పనులకు సంబంధించిన నమూనా లను పరిశీలించి కొన్ని మార్పులుచేర్పులు చేసి రెండు రోజుల్లోగా చివరి ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు పీఠాధిపతి సూచనలు తీసుకొని 21న టెండర్ ప్రక్రియ చేపట్టడానికి ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

యోగానంద లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

జూలపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ శివారులోని శ్రీయోగానందా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ముత్యాల పందిరిని ఏర్పాటుచేసి రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. సన్నాయి మేళతాళాల మధ్య అర్చకులు స్వామి వారల పెళ్లితంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకలను చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవంలో భక్తులు ఆలపించిన గోవింద నామాలు మారుమోగాయి. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం చలువ పందిరి, తాగునీరు, అన్న ప్రసాదం, పలు సౌకర్యాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గొట్టిముక్కుల రజనీ, రవిందర్‌రెడ్డి, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, సీపెల్లిగోపాలక్రిష్ణ, సంకెండ్ల లక్ష్మి రాజం, సీపెల్లి అంజి, బొజ్జ సంపత్, మద్దెల నరేష్, కొండపెల్లి క్రిష్ణమూర్తి, గుండు కరుణాకర్, బాలక్రిష్ణ భక్తులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించండి

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నేతకార్మికుల సమస్యలను పరి ష్కరించాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ కోరారు. ఈ మేరకు అయన కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి చేనేత కార్మికుల సమస్యలను వివరించారు. వాటిని పరిష్క రించేందుకు కేంద్ర జౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్ చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ఢిల్లీకి వస్తే తప్పకుండా కేంద్రజౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించి, పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి సాను కూలంగా ఉందని చెప్పినట్లు వీరమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలిగేటి శ్రీనివాస్, మహిళా విభాగం కోశాధికారి భీమనాతి శారద పాల్గొన్నారు.అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్‌ని శాలువతో సత్కరించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్క ర్స్ (ఎస్‌డబ్ల్యూయూ) ఐఎన్‌టీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశంగౌడ్ అన్నారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెకు ఇది సరైన సమయం కాదని, సంస్థలోని మిగతా సంఘాలను కలుపుకొని వెళ్లాలని అన్నారు. సమ్మెపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు చొరవ చూపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్మికులకు పీఆర్సీ 21శాతం అందించిందన్నారు. రావాల్సిన బాండ్ డబ్బులతోపాటు, డీఏ అందించారన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దశల వారీగా పరిష్కరిస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన పనిభారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాల న్నారు. బ్రీత్ అనలైజింగ్ టెస్టుల్లో వస్తున్న దానికనుగుణంగా కార్మికులను తొలగిస్తున్నారని, బీపీ, షుగర్ మందులతో బ్రీత్ టెస్టుల్లో పర్సెం టీజీలు అధికంగా వస్తున్న విషయాన్ని గమనించి కార్మికులకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో ఉన్నందున మొదటి తేదీన జీతాలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలపై స్పందించాలని, లేని పక్షంలో సమ్మెపై తమ సంఘం కూడా ఆలోచన చేయాల్సి వస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజు, రీజినల్ సెక్రెటరీ టీఆర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కుల మల్లేశంగౌడ్

కుటుంబ కలహాలతో ముగ్గురికి కత్తిపోట్లు

బాధితుల్లో మూడేళ్ల బాలుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో కుటుంబ కలహాలతో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన కలికోట వెంకటేశ్, అతడి అన్న కొడుకు పృథ్వీ మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వెంకటేశ్ అన్న కొడుకు పృథ్వీ, సాయి, మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి వెంకటేశ్- ఏంజెల్ దంపతులు, వారి కొడుకు శివనేత్ర(3)లపై కత్తులతో దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఇందులో శివనేత్ర పరిస్థితి విషమంగా ఉంది. ఏంజెల్‌కు తీవ్ర గాయాలు కాగా, వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో బాలుడు శివనేత్రను హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పృథ్వీ, సాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. కాగా, గతంలో పృథ్వీ అనే వ్యక్తిపై తాను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడు వెంకటేశ్ మీడియా ఎదుట తన బాధను వ్యక్తం చేశాడు. పోలీసులు పట్టించుకుంటే ఈ సంఘటన జరిగేది కాదని వెంకటేశ్ పేర్కొన్నాడు. తనపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు. కాగా, పోలీసులు స్పందించలేదని వెంకటేశ్ పేర్కొనడం అవాస్తమని సీఐ తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

వేలాదిగా అంజన్నను దర్శించుకున్న దీక్షాపరులు



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. కాగ హనుమాన్ చిన్న జయంతి సమీపిస్తుండడంతో వేలాదిగా సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న అంజన్న దీక్షాపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చు కున్నారు. ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

బద్ది పోచమ్మకు బోనాలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలు, పిల్లాపాపలను చల్లగా చూడమ్మ బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ బద్దిపోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారికి మట్టికుండలో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు.



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

మొదలైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

(5వ పేజీ తరువాయి)

విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఇళ్ల నిర్మాణాలను ఆరంభించారు. ఇప్పటి వరకు జిల్లాలోని ఆయా గ్రామాల్లో 623 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాగా ముగ్గులు పోశారు. ఇందులో 230 ఇళ్లు పిల్లర్లు, పునాదుల దశలో కొనసాగుతుండగా, 50 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో పూర్తయ్యాయి. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు అందజేస్తుంది. ఈ డబ్బు లను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. పునాది దశలో లక్ష, లెంటల్ లెవల్‌లో 2 లక్షలు, పూర్తయిన తర్వాత మిగతా 2 లక్షల రూపాయలు దశల వారీగా లబ్ధిదారుల ఖాతా ల్లో జమ చేయనున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సొంత ఇంటి స్థలాలు ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి ఇళ్ల కల నెరవేరుస్తున్నప్పటికీ, లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. ఇంటి పను లను ఆరంభించేందుకు కొంత మందికి ముహూర్తాలు లేక పోగా, మరి కొందరికి ఆర్థికంగా లేకపోవడంతో ఆలస్యం చేస్తున్నారు. ఇది గమనించిన ప్రభుత్వం స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆ సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించింది. ఆ మేరకు జిల్లాలో డీఆర్‌డీఏ అధికారులు, ఎంపీడీవోలు, కార్యదర్శులు ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తిస్తు న్నారు. వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసిన వెంటనే ఇళ్ల నిర్మాణంలో మరింత వేగం పెరగ నున్నది. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు కొత్తగా 26 మంది మేస్త్రీలకు న్యాక్ కేంద్రం ద్వారా ఆరు రోజుల పాటు శిక్షణ ఇప్పించారు. స్వశక్తి సంఘాల్లో సభ్యుల కుటుంబ సభ్యుల్లో సిమెంటు ఇటుకల తయా రీ, సెంట్రింగ్ సామగ్రి సరఫరా చేసేందుకు ఆసక్తి గల వారిని గుర్తించి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు.

లబ్ధిదారులకు అవగాహన..

- రాజేశ్వర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు అధికారి



జిల్లాలో గుర్తించిన మండలానికి ఒక గ్రామంలో సొంత ఇంటి స్థలం గల అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. స్వశక్తి సంఘాల్లో ఆర్థికంగా లేని లబ్ధిదారులను గుర్తించి బ్యాంకుల ద్వారా వారికి లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం ఇప్పించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటు న్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 50 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ లెవెల్ వరకు నిర్మాణాలను పూర్తి చేయగా, బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే ఖాతాలో బిల్లులు జమ కానున్నాయి.

జెన్‌కో ఆధ్వర్యంలోనే విద్యుత్ కేంద్రం నిర్మాణం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న జెన్‌కో ఉద్యోగులు

గోదావరిఖని, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రామగుండంలో మూసి వేసిన బీ పవర్‌హౌస్ స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్ర స్థాపనే తన జీవిత ఆశయమని, జెన్‌కో ఆధ్వర్యంలోనే విద్యుత్ కేంద్ర స్థాపన జరుగుతుందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం జెన్‌కో ఉద్యోగులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండంలో గతంలో జెన్‌కో విద్యుత్ కేంద్రం విషయంలో కొందరు స్వార్థపూరితంగా ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. జెన్‌కో ఆధ్వర్యంలోనేవిద్యుత్ కేంద్రం నిర్మాణం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కలు ప్రకటించారన్నారు. ఎన్‌టీపీసీలో 800మెగావాట్ల మూడు యూనిట్ల నిర్మాణానికి గతంలో కేసీఆర్ అడ్డు చెప్పారన్నారు. మేడిపల్లి ఓపెన్‌కాస్టులో 500మెగావాట్ల సంప్‌డ్ స్టోరేజ్ విద్యుత్ నిర్మాణం కూడా జరుగనున్నదన్నారు.

బ్రాస్‌బ్యాండ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బ్రాస్ బ్యాండ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లో మంగళ వారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బ్రాస్ బ్యాండ్ కార్మికుల వర్కర్స్ యూనియన్ మహాసభలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలసి సీఎం దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఈఎస్‌ఐ సౌకర్యం వర్తింపజేసే విధంగా జీవో అమలు చేసేందుకు కృషి చేస్తానని, యాభై ఏళ్ళు పైబడిన కార్మికులకు ప్రభుత్వం పరంగా పెన్షన్ ఇప్పించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. అంతటి అన్నయ్య గౌడ్, ప్రకాష్ రావు, మహేందర్, పారుపల్లిగుణపతి, శ్రీకాంత్, జహంగీర్ పాల్గొన్నారు.


కృష్ణవేణి విద్యాసంస్థలో స్నాతకోత్సవం



కృష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కృష్ణవేణి పాఠశాలలోని విద్యార్థుల స్నాతకోత్సవ వేడుక మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యుకేజీ నుంచి 5వతరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు ఎం.శ్రావణ్‌కుమార్, కె.సాయిచంద, సాయిగణేష్, మనోజ్‌లను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ప్రిన్సిపాల్స్ రామకృష్ణ, సత్యనారాయణ, రాజిరెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బంది, పోషకులు పాల్గొన్నారు.

ఘనంగా బంజారా కులస్తుల బోగ్‌బండార్ వేడుక



కొంరయ్యను సత్కరిస్తున్న బంజారా కులస్తులు

రామగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌లో బంజారా కులస్తుల బోగ్‌బండార్ వేడుకను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎంపిపి ఆరెల్లిదేవక్కకొంరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారికి శాలువతో ఘనంగా సత్కారించారు. నాయకులు తొటచంద్రయ్య, బాపు, కాటంసత్యం, బంజారు కులసంఘాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్ల మౌలిక సౌకర్యాలకు నిధులు మంజూరు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రామగుండం అర్బన్‌లో డబుల్ బెడ్‌రూంలను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మౌలిక సదుపాయాలు కల్పనకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చొరవతో ప్రభుత్వం రూ.7.4కోట్లు మంజూరు చేసినట్టు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్య క్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు మహంకాళి స్వామి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూంల్లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, డ్రైనేజీ, మం చినీటి సౌకర్యాలకు నిధులు వెచ్చించనున్నారు. 670 డబుల్ బెడ్‌రూంలను త్వరితగతిన పూర్తి చేయించి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువస్తారన్నారు. రామగుండంలో రూ.400కోట్లతో అభివృద్ధి పనులు జరుగు తున్నాయన్నారు. రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయని పేర్కొన్నారు. పేదల నివాసాల గురించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాల్వ లింగస్వామి, సుజాత, నాజీమ్, లచ్చన్న, కుడుదుల శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధి ధ్యేయంగా వ్యవసాయ మార్కెట్ పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో వరికోతలు మొదలవుతున్నాయని, ఐకేపీ, సొసైటీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతీ డైరెక్టర్ గ్రామాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. మార్కెట్ యార్డులో నూతన కార్యాలయ భవన నిర్మాణానికి తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి డైరెక్టర్లతో చర్చించి పలు తీర్మానాలు చేశారు. వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గానవేైన సదయ్య, వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లు, డైరెక్టర్లు కలవేన రాజయ్య, దోమ్మటి రాజయ్య, కదురు మల్లయ్య, ఏనుగంటి రవి, చలిగంటి రామచంద్రం, అబ్దుల్ రసూల్, దోబిల సంపత్, కోమల మల్లమ్మ, దాగేటి రామచంద్రం, కూనారపు రమేష్, శివరాత్రి కిషోర్, నార్ల విజయలక్ష్మి ఉన్నారు.

పుడమిపుత్ర అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వసుంధర విజ్ఞాన్ వికాసమండలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో కృషిచేస్తున్న వారికి పురస్కారాలు అందించేందుకు ఆహ్వానిస్తున్నట్లు ఆసంస్థ అధ్యక్షుడు చదువు వెంకటరెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి, కొత్తవంగడాలు, విత్తనాల తయారీ, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, వ్యవసాయోత్పత్తుల పెంపులో కృషిచేసిన రైతుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8096677409లో సంప్రదించాలని, దరఖాస్తులు ఈనెల 15 లోగా చేరాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ వైస్‌చైర్మన్ గోపాల్‌రావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తానిపర్తి గోపాల్‌రావు కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు, పోలుసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మీర్జంపేటలో ఇరుముడి పూజలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మీర్జంపేటలో మంగళవారం హనుమాన్ భక్తులు ఆలయంలో ఇరుముడి కట్టుకున్నారు. 20రోజులు దీక్షలు చేసిన హనుమాన్ భక్తులు ఇరుముడి కట్టుకొని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం తరలివెళ్లారు. మాజీ ఎంపీటీసీ సదానందం, శివారెడ్డి, మల్లేష్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

హన్మాన్ ఆలయ కమిటీ

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం హనుమాన్ ఆలయ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా తాళ్ల మురళీకృష్ణ, వైస్ చైర్మన్‌గా బాలసాని సందీప్, సెక్రటరీగా తోట శ్రీధర్, కోశాధికారిగా సతీష్, జాయింట్ సెక్రటరిగా వీరబోయిన శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా నల్ల మధుకర్ రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చెలుకల సంపత్, ఎద్దు సంపత్, సంపత్, రాజయ్య, నర్సింగం పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై కమిషనర్‌కు ఫిర్యాదు

మంథని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెంద గ్రామ పంచాయతీ మాజీ కార్యదర్శి సాగర్‌రావుపై పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరెంద గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో రూ.10 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు విచారణలో తేలినప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడిన కార్యదర్శి పై చర్య తీసుకోవాలని కోరారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

మంథని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు క్రాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేటి నుంచి బీరన్న ఉత్సవాలు

రామగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లో బుధవారం నుంచి 17 తేదీ వరకు బీరన్న ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గొల్ల, కురుమల మంగళవారం ఒక ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. ప్రతీ 9 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు పెద్దసంఖ్యలో కులబంధువులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అంతర్గాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మంగళ వారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ జీఓ 51ను సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 19తర్వాత నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మాలెం సురేష్, పెంద్రు మల్లారెడ్డి, తమ్మనవేని శంకర్, భీమయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సుల్తానాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యులు గల ఓ కుటుంబం కోమండ్లపల్లిలోని కెబిసి ఇటుక బట్టీలలో పని చేస్తున్నారు. దుశిలా పోద్ (45) అనే కార్మికురాలికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంగళవారం కాట్నపల్లిలోని ఓ ప్రైవేట్ డాక్టర్ వద్ద చూపించుకొంది. తిరిగి రోడ్డు దాటుతుండగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న కారు ఆమెను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుశిలా పోద్‌ను సుల్తానాబాద్ ఆస్పత్రికి అనంతరం కరీంనగర్, వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. మృతురాలి భర్త చబిలాల్ పోద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

దుకాణ సముదాయాలకు వేలం

ఎలిగేడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలిగేడు గ్రామపంచాయతీకి సంబంధించిన దుకాణ సముదాయాలు, వారసంత వేలంపాటను మండల పంచాయతీ అధికారి బేరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ గరిష్ట ధరకన్న అధికంగా చెల్లించిన పూర్వ వినియోగదారులనే ఆయా దుకాణ సముదాయాల్లో కిరాయికి కేటాయించారు. కోడూరు సాయి ప్రతీ బుధవారం నిర్వహించే వారసంతను తగ్గించుకున్నారు. గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సఫాయి కార్మికుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

రామగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూప్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కించపర్చుతూ రూపొందించిన వీడియోను లొంకకేసారం గ్రామపంచాయతీ సఫాయి తిరుపతి వైరల్ చేయడం పై మంగళవారం ఎంపీవో ఉమేష్‌కు ఫిర్యాదుచేశారు. సదరు సఫాయి పై చర్యలు తీసుకొవాలని పేర్కొన్నారు. లొంకకేసారం గ్రామంలో ఎండీ. మంజూర్ సైన్యం అనే వాట్సాప్ గ్రూప్‌లో కేసీఆర్ పై విమర్శలు చేస్తున్న వీడియోను వైరల్ చేశాడని పేర్కొన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు జాపతి శేఖర్ ఆధ్వర్యంలో నాయకులు బొంకూరిపోచం, యాదగిరి ఓదెలు ఫిర్యాదు చేశారు.

పేదలకు కడుపునిండా అన్నం పెట్టేందుకే సన్న బియ్యం

సుల్తానాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పేదలు కడుపు నిండా అన్నం తినడం కోసమే ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నీరుకుళ్ళలో మంగళవారం సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించి పేదలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతు గత ప్రభుత్వ హయాంలో దొడ్డు బియ్యం ఎవరూ తినడానికి ఇష్టపడలేదని, ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, మాజీ మార్కెట్ చైర్మన్ మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, తహసీల్దార్ రాంచంద్రారావు, ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): ఎల్కలపెల్లి, ఈసాలతక్కళ్లపల్లి, రామరావుపల్లె, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న మక్కాన్‌సింగ్ సేవసమితి చైర్‌పర్సన్ మనాలిఠాకూర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరు సన్నబియ్యం తినాలని ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ముందుకు సాగుతున్నాడని తెలిపారు. అర్హులైన వారందరికి త్వరలోనే రేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని పేద విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యే విధంగా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటీసీలు, డీలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామరావుపల్లెలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మనాలి ఠాకూర్

ఎన్టీపీసీలో చలివేంద్రం ప్రారంభం

జ్యోతినగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద భగవతి యూత్ అ సోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ట్రాఫిక్ ఎస్ఐ హరి శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు రావడంపై ఎస్ఐ హర్షం వ్యక్తం చేశారు. యువత స్వచ్ఛంద కార్యక్రమాలలో పాల్గొనిప్రజా సేవ చేయాలన్నారు. భగవతి యూత్ అధ్యక్షుడు కంకటి రవిగౌడ్, వొల్లాల సురేష్, బుద్దె సతీష్, మామిడాల చంద్రయ్య, కిషన్‌రావు, ఆడెపు పరంధాములు, సుమలత, శ్రీలత, కళ్యాణి, శాంత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతకు బహుమతులు ప్రదానం

కమాన్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోచమ్మకుంటలో శ్రీరామనవమి రోజున ప్రారంభించిన రామన్న క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో 10జట్లు పాల్గొనగా కమాన్‌పూర్, జూలపల్లి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కమాన్‌పూర్ జట్టు విజేతగా నిలవగా, జూలపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. నిర్వాహకులు బహుమతులు, నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. నాయకులు ఇనగంటి జగన్నాథరావు, పిన్రెడ్డి కిషన్‌రెడ్డి, గడప కృష్ణమూర్తి, మల్యాల తిరుపతి, ఎంఏ.రఫీక్, అంబీరు శ్రీనివాస్, రంగు సత్యనారాయణగౌడ్, నగునూరి నర్సయ్యగౌడ్, బొజ్జ నర్సింహాచారి, బొజ్జ సాగర్, పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హోమం

ఎలిగేడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శ్రీభక్తాంజనేస్వామి దేవాలయంలో మంగళవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఆంజనేస్వామికి పంచామృతాలతో అభిషేకం, హోమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ తానిపర్తి సంజీవరావు, ఆలయ గురుస్వాములు కొమురయ్య, రాజేశం, అంజయ్య, బాలాజీ, సతీష్, రవి, మల్లేశం, పసట్ల రాజేశం, చందు, పాల్గొన్నారు.

ఈజీఎస్ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

మంథనిరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపాక, అక్కెపల్లి, చల్లపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు మంగళవారం సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. ఈజీఎస్ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పిన ప్రకారం మహిళా శక్తిని వెలికి తీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఐలి ప్రసాద్, పెంద్రు రమ-సురేష్‌రెడ్డి, రావికంటి సతీష్, మూల సరోజన, జనగామ నర్సింగరావు, కుడుదుల వెంకన్న, మంథని సత్యం, కొత్త శ్రీనివాస్, ఆకుల కిరణ్‌లు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపుపై స్పందించిన కేంద్రమంత్రి

ఉన్నత స్థాయి కమిటీ సమీక్షిస్తుందని ఎంపీ వంశీకృష్ణకు లేఖ

గోదావరిఖని, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపుపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గత నెల 12న పార్లమెంట్‌లో మాట్లాడారు. కేంద్ర మంత్రిగా 35ఏళ్ల క్రితం వెంకట స్వామి ఆధ్వర్యంలో తీసుకువచ్చిన పెన్షన్ పథకం మూడేళ్లకోసారి సవరించాల్సి ఉండగా పెంచలేదన్నారు. రూ.1500 పెన్షన్‌కు బియ్యం బస్తా కూడా రావడం లేదని, దీనిపై సమాధానం చెప్పాలన్నారు. స్పందించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి సతీష్‌చంద్ర దూబే గడ్డం వంశీకృష్ణకు లేఖ రాశారు. పెన్షన్ మూడేళ్లకోసారి సవరించాల్సింది వాస్తవమేనని అంగీకరించారు. పెన్షన్ పథకంపై 2022లో ఒక నివేదిక ఇచ్చా రని, దీని ప్రకారం 2031-32 వరకు 47,961కోట్ల లోటుకు వెళ్లనున్నదని పేర్కొన్నారు. దీనిపై జనవరి 17న సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సమా వేశంలో చర్చించారని, పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ నియమిం చారన్నారు. కమిటీ నివేదిక అనంతరం నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పెన్షన్ పెంచేంత వరకు పోరాడుతామని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు.

జీడీకే 11ఇంక్లైన్‌ను తనిఖీ చేసిన డీఎంఎస్



గనిలోకి దిగుతున్న డీఎంఎస్ బానోత్ వెంకన్న

గోదావరిఖని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 11ఇంక్లైన్‌ను మంగళవారం డీఎంఎస్ బానోత్ వెంకన్న తనిఖీ చేశారు. గని ఏజెంట్ కార్యాలయంలో గనిలోని వివిధ సీమ్‌ల ప్యానెల్, గని ప్లాన్‌లను పరిశీలించారు. గని ఉత్పత్తి, ఉత్పాదకతను, గనిలో తీసుకోవల్సిన రక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం గనిలోని 3సీమ్ సీఎం సెక్షన్‌ను తనిఖీ చేసి తగు సలహాలు సూచనలను చేశారు. గని ఏజెంట్ సీ శ్రీనివాస్, గని మేనేజర్ బీ మల్లేశం, రక్షణాధికారి మల్లేష్, డీవైఎస్ఎస్ఓ వై హనుమండ్లు, పిట్ ఇంజనీర్ డీ. రాకేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఓబీ కంపెనీ దుమ్మును నియంత్రించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఓబీ కంపెనీ వీ9 కంపెనీ నుంచి వెలువడుతున్న దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సింగిరెడ్డి పల్లె నాయకులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఎలువాక ఓదేలు, తోడేటి శ్రీనివాస్, బానయ్యలు మంగళవారం ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సింగరేణి ఓసీపీ-3 ఫేజ్-2లో మట్టి వెలికితీత పనులు నిర్వహిస్తున్న వీ9 కంపెనీ గ్రామానికి సమీపంలో తొలగించిన మట్టిని పోస్తుండడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నట్టు వారు పేర్కొన్నారు. దుమ్ము నియంత్రణ చర్యలు తీసుకునేలా సదరు కంపెనీకి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నియామకం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్జీ-2 కన్వీనర్‌గా శనిగారపు పోచయ్య నియమితులయ్యారు. ఈమేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగారపు లింగమూర్తి గోదావరిఖనిలోని కేంద్ర కార్యాలయంలో పోచయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు. ఓసీపీ-3 ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.